
# మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సి ఐ జె. మురళి
- నక్కపల్లి లో అట్టహాసంగా నషా ముక్త్ భారత్ అభియాన్
- డ్రగ్స్ వ్యతిరేక అవగాహన భారీ ర్యాలీ

**నక్కపల్లి,పెన్ సత్తా, జూన్26:** మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల కేంద్రం నక్కపల్లి లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది.జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా, నర్సీపట్నం సబ్ డివిజన్ పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం నక్కపల్లి సి ఐ జె. మురళి ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా నక్కపల్లిలో మాదకద్రవ్యాల నిర్మూలనపై భారీ డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు సుమారు 500 మంది విద్యార్థులతో నక్కపల్లి ప్రధాన వీధులు, జాతీయ రహదారిపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నక్కపల్లి సిఐ మురళి విద్యార్థులు, ప్రజలకు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయం, వినియోగం వంటి కార్యకలాపాలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని వివరించారు.మాదకద్రవ్యాలకు సంబంధించిన ఏవైనా అక్రమ కార్యకలాపాలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.యువత మాదకద్రవ్యాలు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండి, విద్య, క్రీడలు,సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అవగాహన కల్పించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్య రహిత సమాజం -- మనందరి బాధ్యత, డ్రగ్స్‌కు నో చెప్పండి వంటి నినాదాలతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు,నక్కపల్లి ఎస్ ఐ సన్నిబాబు, సాహిబా అంజుమ్ పోలీస్ సిబ్బంది ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, మాదకద్రవ్యాలకు సంబంధించిన ఏవైనా అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.






# తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం.





ఘనంగా జనసేన నేత రుత్తల నరేష్ జన్మదిన వేడుకలు.

**అచ్యుతాపురం, పెన్ సత్తా, జూన్ 26:** అచ్యుతాపురం ఎస్ కె ఆర్ ఫంక్షన్ హాల్ లో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఇచ్చాపురం శాసనసభ్యులు, జోనల్ ఇంచార్జ్ బెందాళం అశోక్, యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, యలమంచి నియోజకవర్గ పరిశీలికలు ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లాలం భవాని భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను ఎల్లప్పుడూ గుర్తిస్తుందని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ గెలిపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు కలిసి పనిచేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో అర్థమంతంగా పూర్తి చేయాలని, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏ సమస్యలు వచ్చినా నియోజవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు కి, స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ కి తెలియజేయాలన్నారు. కూటమి నాయకులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తామని, కష్టపడిన ఏ కార్యకర్తకు అన్యాయం జరగకుండా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కార్యకర్తలకు అండగా ఉంటున్నారని అన్నారు.

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళుగా తెలుగుదేశం పార్టీ ముందుకు వెళుతుందని, అందుకోసం అందరం కలిసిమెలిసి పనిచేయాలని తెలిపారు.

అనంతరం అచ్యుతాపురం లోని ఎస్ఈజెడ్ కాలనీ జనసేన పార్టీ జనరల్ సెక్రెటరీ రుత్తల నరేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.

అట్లాస్ హోటల్లో జరిగిన జనసేన నేత రుత్తల నరేష్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు పాల్గొని కేక్ కట్ చేసి నరేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గొంతిన హరీష్, మండల అధ్యక్షులు పీలా తులసి రాం, లాలం భరత్, పెంటకోట విజయ్, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె శివన్నారాయణ మూర్తి, డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, మామిడి శివ అప్పారావు, కొలుకులూరు విజయరామరాజు, ఆడారి మంజు, ఆడారి జానకి, రాజాన నారాయణమ్మ, జనపరెడ్డి నరసింగ రావు, వసంతవాడ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ చంద్రశేఖరరావు





**అచ్యుతాపురం, పెన్ సత్తా, జూన్ 26:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో ఉన్నత భవిష్యత్తును పొందాలని అచ్యుతాపురం సీఐ ఆర్.వివిఎస్ చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 200 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల గురించి, ఆలోచిస్తూ ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.

చెడు అలవాట్లకు లోనై చదువును పక్కన పెట్టి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నప్పుడు మత్తు పదార్థాల జోలికి వెళ్లరని, వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు అభినందనీయులని అన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ జీవితాన్ని సర్వనాశనం చేస్తాయని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి చట్టపరంగా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని, వాటి గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్ రావు, వెంకట్రావు, మహిళా ఎస్ఐ పోసణ గౌరీ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అగాపే ఆశ్రమంలో అన్నదానం

**యాడికి పెన్ సత్తా, జూన్ 26** యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో పూసుపల్లి రఘురామరెడ్డి, భార్య హేమలత వారి కుమారుడు పూసుపల్లి రిషిధర్ రెడ్డి 9వ పుట్టినరోజు శుభ సందర్భంగా ఓబులాపురం లో నివాసం ఉంటున్న రిషిధర్ తాతయ్య వెన్నుపూస లక్ష్మిరెడ్డి, అమ్మమ్మ లక్ష్మీనారాయణమ్మ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, అలాగే రాత్రి భోజనం మూడు పూటలా సమృద్ధి అయిన భోజనాలు ఏర్పాటు చేయించారు.వారి మనవడికి పెద్దల ఆశీస్సులు కావాలని ఆశ్రమంలోనికి వచ్చి, వృద్ధుల, నిరాశ్రయుల మధ్యలో కేక్ కట్ చేసి, వారి అన్నదానం చేశారు. ఆశ్రమం లోని పెద్దలతో పాటు, ఆశ్రమం ఫౌండర్ బత్తల ప్రసాద్ గారు రిషిధర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, నిండు మనసుతో రెండు చేతులెత్తి దీవించి, వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

# చేపలు చనిపోవడానికి కారణమైన రిపోర్ట్ బహిర్గతం చేయాలి

సిపిఎం డిమాండ్



**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 26:** బోయపాడు సముద్రతీరం లో ఈ నెల 20వ తేదీ న టన్నులు కొలది చేపలు చనిపోవడానికి గల కారణాలను బహిర్గతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, కాలుష్య నియంత్రణ మండలి, ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు చనిపోయిన చేపలు, సముద్ర జలాలను పరీక్షలకు తీసుకుని వెళ్ళడం జరిగిందన్నారు.సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా నేటికి పరీక్షలు నిర్వహించిన రిపోర్టు అధికారులు ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. ఎవరిని కాపాడటం కోసం సంబంధించిన అధికారులు రిపోర్టు విడుదల చేయలేదని తక్షణమే చేపలు మృత్యువాతకు గల కారణాలను తెలియజేయాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.గతంలో కూడా ఈ విధంగా చేపలు చనిపోయి ఒడ్డుకు కొట్టుకు వచ్చినప్పుడు సముద్ర జలాల్లో ఆక్సిజన్ శాతం తక్కువగా ఉందని, వాతావరణంలో వచ్చిన మార్పులు వలన చేపలు చనిపోయాయని సంబంధించిన అధికారులు నివేదికలు ఇవ్వడం జరిగిందని ఇప్పుడు కూడా వాస్తవాలు దాచిపెట్టి హెటిరో డ్రగ్స్ రసాయన కంపెనీ యాజమాన్యంను కాపాడటానికి అధికారులు ఈవిధమైన నిర్లక్ష్యం, ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఒక హెటిరో డ్రగ్స్ కంపెనీ వలనే ఇంత అనార్థం జరిగి చేపలు చనిపోయి మత్స్యకారులు ఉపాధి కోల్పోతుంటే , విదేశాలలో ను, కాకినాడ జిల్లా లో ప్రజలు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్స్ కంపెనీ లు ఇక్కడ ఏర్పాటు చేసి మత్స్యకారుల వృత్తికి, ఉపాధి కి నష్టం కలిగించే విధంగా చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. మత్స్యకారుల ఉపాధి, మనుగడకు నష్టం కలిగించే విధంగా ప్రభుత్వం పూనుకోవడం న్యాయం కాదని తెలిపారు.వెంటనే ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు ను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి ఎం.మహేష్ బాబు, మత్స్యకారుల సంఘం నాయకులు జీ.సోమేశ్వరావు,సిహెచ్ సోమేష్,బి.నూకరాజు,కె.దేముడు,సి. హెచ్.వీరబాబు,బి.అప్పలరాజు,కె.కాశీరావు,పి.రమణ,కె.కాశీ,సి. హెచ్.రాజు,పి.లోవరాజు,జీ.కాశీరావు ,కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి పత్రాలు అందజేసిన మంత్రి సవితమ్మ



**పెనుకొండ, పెన్ సత్తా, జూన్ 26** నియోజకవర్గంలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సంక్షేమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి ఎస్. సవితమ్మ అండగా నిలిచారు.పెనుకొండ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి, సంబంధిత పత్రాలను మీడియా ప్రతినిధులకు మంత్రి సవితమ్మ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, ప్రజలకు నిత్యం సమాచారం అందించే జర్నలిస్టులు సమాజానికి కీలకమైన సేవ చేస్తున్నారని అన్నారు. వారి ఆరోగ్య భద్రత ఎంతో ముఖ్యమని, అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.మంత్రి సవితమ్మ చేసిన ఈ సహాయానికి జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నందుకు అభినందనలు తెలిపారు.

# ఢిల్లీలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు - సూర్యనారాయణ రెడ్డికి ఘన సన్మానం

**యాడికి జూన్ 26 పెన్ సత్తా, :** సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా , పార్టీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, స్వాతంత్ర సమరయోధులు, సిపిఐ సీనియర్ నాయకులు ను గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ భాస్కర్ ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ సీనియర్ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుండి "సేవా పురస్కారం" లభించిన విషయాన్ని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా దృష్టికి తీసుకెళ్లారు. సూర్యనారాయణ రెడ్డి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర పురస్కారం రావడం పట్ల డి. రాజా హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు.అనంతరం డి. రాజా స్వయంగా సూర్యనారాయణ రెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. "స్వాతంత్ర్య పోరాటం నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సూర్యనారాయణ రెడ్డి లాంటి నేతలు పార్టీకి, యువతకు స్ఫూర్తి" అని డి. రాజా కొనియాడారు.ఈ కార్యక్రమంలో పలువురు సీపీఐ జాతీయ నాయకులు పాల్గొన్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily
శనివారం 27 జూన్ 2026

# సంపాదకీయం


## నిరూపణ భారమెవరిది?

పాస్‌పోర్ట్ పౌరసత్వ రుజువు కాదని విదేశాంగ మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా తీవ్ర అలజడికి కారణమైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షలు, ఉత్తర ప్రదేశ్‌లో 2.04 కోట్ల పేర్లు తొలగించబడిన నేపథ్యంలో.. ఈ ప్రకటన సామాన్య పౌరుల్లో అభద్రతాభావాన్ని మరింత పెంచింది. చట్టపరంగా ఆ మాట సరైనదే. 1967 పాస్‌పోర్ట్ చట్టం దాన్ని కేవలం ప్రయాణ దస్తావేజుగా మాత్రమే నిర్వచించింది. కానీ వైరుధ్యమేమిటంటే పాస్‌పోర్ట్ పౌరులకే ఇస్తారు,. అయినా పౌరసత్వ రుజువు కాదంటున్నారు. మరి భారతీయుడినని నిరూపించుకోవడానికి ఏ ఒక్క దస్తావేజు సరిపోతుంది? సమాధానం ప్రభుత్వం దగ్గర లేదు. అదే నేటి సంక్షోభానికి అసలు కారణం!

భారత్‌లో పాస్‌పోర్ట్ పౌరసత్వ రుజువు కాదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారి చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా ఆందోళన రేకెత్తించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఒక పాస్‌పోర్ట్ హోల్డర్ పేరు తొలగించబడటంపై ఈ ప్రకటన వెలువడింది. నిజానికి చట్టపరంగా ఆ అధికారి చెప్పింది తప్పు కాదు. 1967నాటి పాస్‌పోర్ట్ చట్టం స్పష్టంగా పాస్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రయాణ దస్తావేజుగా మాత్రమే నిర్వచించింది. 2013లో బాంబే హైకోర్టు కూడా పాస్‌పోర్ట్ స్వయంగా పౌరసత్వ నిరూపణ కాదని తేల్చిచెప్పింది. కానీ ఇక్కడ చట్టబద్ధత మాత్రమే ప్రశ్న కాదు, పాస్‌పోర్ట్ అమలులో ఉన్న వైరుధ్యం ప్రశ్న. 1967నాటి పాస్‌పోర్ట్ చట్టం సెక్షన్ 6(2)(ఏ) ప్రకారం భారత పౌరుడుకాని వ్యక్తికి పాస్‌పోర్ట్ ఇవ్వడాన్ని తిరస్కరించాలని నిర్దేశించింది. అంటే పాస్‌పోర్ట్ పౌరులకే ఇస్తారు. కానీ పౌరసత్వ రుజువు కాదని చెప్పడంలో ఉన్న వైరుధ్యమేమిటి? ఈ ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర సరైన సమాధానం లేదు. 'సర్' ప్రక్రియలో పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 91 లక్షలమంది ఓటర్ల పేర్లు, ఉత్తరప్రదేశ్‌లో 2.04 కోట్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించబడ్డాయి. ఇవన్నీ అక్రమ వలసదారులేనని నిర్ధారించే విధానం ఏమిటనే ప్రశ్న సమాజంలో అలజడి సృష్టిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రకటన తర్వాత అనేకులు పౌరసత్వం రద్దు భయంతో అసాధారణ మానసిక క్షోభకు గురయ్యారు. కొందరు ఈ ఆందోళనలో ప్రాణాలు కూడా తీసుకున్నారని నివేదికలు వెల్లడించాయి. ఇది కేవలం కాగితాల సమస్య కాదు, మనుషుల జీవితాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన అంశం.

భారత్‌లో పౌరసత్వాన్ని నిరూపించే ఒకే ఒక్క అధికారిక దస్తావేజు లేదనేది చాలా కాలంగా ఉన్న వాస్తవం. జాతీయ పౌరుల నమోదు నిర్మించే ప్రయత్నాలు పదే పదే అసంపూర్తిగా మిగిలిపోయాయి. పౌరసత్వ నిరూపణ అనేది పత్రాల ద్వారా నిర్ణయించడం చాలా సంక్లిష్టమైన వ్యవహారం. భారతదేశ పౌరసత్వ సంప్రదాయం మొదటినుంచీ సహనశీలమైనది. ఈ నేలమీద నివసిస్తున్న వ్యక్తి పౌరుడేనని (అనుమానానికి తగిన ఆధారాలు లేనంత వరకు) భావించడం మూల సూత్రంగా ఉండేది. ఆ విశాలదృష్టి ఉద్దేశపూర్వకంగా రూపొందించినదే. ఎందుకంటే భారత్ అనేది అసంఖ్యాక జాతులు, సంస్కృతులు, మతాల సమ్మేళనం. కానీ ఇప్పుడు ఆ విధానానికి విరుద్ధంగా, పత్రాల ఆధారంగా పౌరసత్వాన్ని నిర్ణయించే వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోంది. 2003, 2015, 2019, 2025 సంవత్సరాల్లో పౌరసత్వ చట్టానికి జరిగిన సవరణలు ఈ ప్రవాహాన్ని మరింత వేగవంతం చేశాయి. ఎన్నికల సంఘం జూన్ 2025 ఆదేశంలో పేర్కొన్న 11 దస్తావేజుల్లో ఐదు దరఖాస్తుదారుని పుట్టిన తేదీ, స్థలాన్ని తెలియజేయవు. ఓటర్ కార్డులు, రేషన్ కార్డులు, పాన్ కార్డులను జాబితా నుంచి తొలగించారు. ఇది సామాన్య పౌరులకు తలకు మించిన భారంగా మారుతోంది. పుట్టినచోటు నిరూపించాలంటే పుట్టుక ధృవపత్రం కావాలి. తల్లిదండ్రులు భారత్‌లో పుట్టారని చూపించాలంటే వారి పత్రాలు కావాలి. ఎన్నికల సంఘం అధికారులు పాస్‌పోర్ట్ 'సర్' ధృవీకరణకు చెల్లుబాటయ్యే 12 దస్తావేజుల్లో ఒకటిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ పౌరసత్వ రుజువు కాదనే విషయంలో ఇది కొత్త విధానం కాదని, బీహార్ 'సర్'నుంచి ఇదే అమలవుతోందని వారు చెప్పారు. ఈ వివరణ గందరగోళాన్ని కొంత తగ్గించినప్పటికీ, మూలప్రశ్నకు మాత్రం సమాధానం ఇవ్వలేకపోయింది. అసలు పౌరసత్వం నిరూపించే ఒకే ఒక్క నిర్ణయాత్మక దస్తావేజు ఏది?

ఇది నేటి సమస్య మాత్రమే కాదు. రేపటి ప్రమాదానికి హెచ్చరికగానూ పరిగణించాలి. పాస్‌పోర్ట్ పౌరులకే ఇస్తారు. అయినప్పటికీ పౌరసత్వ నిరూపణ కాదనే వైరుధ్యం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. 'సర్' వంటి ప్రక్రియలు ప్రభుత్వానికి, సంస్థలకు తమ విచక్షణతో ఒక్కొక్క దస్తావేజు అడిగే అధికారాన్ని ఇస్తే.. అది అంతులేని నిరూపణ పరంపరకు దారితీయదా? ధనవంతులైనా, చదువుకున్నవారైనా పాత పత్రాలు సేకరించడం కష్టంగా ఉంటుంది. పేదలకు, నిరక్షరాస్యులకు, వలసకూలీలకు పత్రాల నిరూపణ దాదాపు అసాధ్యం. నగరపాలక కార్యాలయాల్లో పుట్టుక ధృవపత్రాలు తీసుకోవడం అనేది సామాన్యుడికి అసాధ్యమైన అనుభవం. ఇక తల్లిదండ్రుల, తాతముత్తాతల పత్రాలు అడగడం ప్రారంభించే రోజు వస్తుందా? అనే ఆందోళన కూడా నిరాధారమైనది కాదు. పౌరత్వ నిర్ధారణ ప్రక్రియ మరింత కఠినమవుతున్న కొద్దీ, అమాయకంగా మంచి నమ్మకంతో "నేను భారతీయుడిని" అని చెప్పుకునే కోట్లాది ప్రజలు నిరంతర సాక్ష్యాల వేటలో అలసిపోయే ప్రమాదముంది. అక్రమ వలసదారులను గుర్తించే ప్రయత్నంలో నిజమైన పౌరులను వేధించే దుస్థితి రాకూడదు. ప్రభుత్వం ఒక్క ప్రశ్న తనకుతానే వేసుకోవాలి. చట్టపరంగా తాము చెప్పింది సరైనదే అయినప్పటికీ, పుట్టి పెరిగిన మట్టిని మాతృభూమిగా నమ్మిన వ్యక్తి ఇప్పుడు తన పౌరత్వాన్ని నిరూపించుకోవలసిన పరిస్థితికి ఎందుకు వచ్చాడు? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడంలోనే ప్రజాస్వామ్య ప్రభుత్వం యొక్క నిజమైన పరీక్ష ఉంది. పత్రాల కోసం ప్రజలను వేటాడటం కాదు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే రాజ్యం యొక్క మొదటి బాధ్యత. పౌరసత్వ నిర్ధారణ పేరుతో సాగే ఈ పత్రాల పరంపర ఒక వర్గాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకుంటోందనే అనుమానాలు వేళ్లూనుకుంటే.. అది ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం. చట్టాలు మారొచ్చు, పత్రాలూ అడగొచ్చు. కానీ తరతరాలుగా ఈ మట్టిలో పుట్టి, ఇక్కడే జీవించి, ఇక్కడే కలిసిపోయిన వ్యక్తికి "నువ్వు భారతీయుడివా?" అని అడగడం అత్యంత వేదనాభరితమైన అనుభవం. ఆ వేదనను అర్థం చేసుకోవడంలోనే సంవేదనాశీలమైన పాలన యొక్క నిజమైన పరిపక్వత ఉంది!



## చల్లారని యుద్ధ సెగ!

ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా మాస్కో ఆధీనంలో ఉన్న క్రిమియాతోపాటు రష్యా వ్యాప్తంగా 12 ప్రాంతాలపై కీవ్ వందల కొద్దీ డ్రోన్లతో విరుచుకుపడింది. ఒక్క రాత్రే 660 డ్రోన్లను ప్రయోగించింది. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభమైన తర్వాత ఇది అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఒకటిగా నిలిచింది. గత ఏడాది మే 17న 556 డ్రోన్లతో జరిగిన దాడి గత రికార్డుగా ఉండగా, ఇప్పుడది బద్దలైంది. వీటన్నింటిని తాము సమర్థవంతంగా అడ్డుకున్నామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. రాజధాని మాస్కో సహా అజోవ్, నల్ల సముద్ర తీరంలోని నగరాలు, క్రిమియాను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంది. తమ నగరంవైపు దూసుకొచ్చిన 47 డ్రోన్లను కూల్చేసినట్లు మాస్కో మేయర్ వెల్లడించారు. అయితే, దీనివల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందా? అనే వివరాలను బయటపెట్టలేదు. నోవోమోస్కోవ్‌స్కీ ప్రాంతంలోని ఓ కెమికల్ ప్లాంట్, హైడ్రోఎలక్ట్రిక్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించగా అక్కడ భారీగా మంటలు చెలరేగినట్లు వార్తలు వస్తున్నాయి. నోవోమోస్కోవ్‌స్కీ థర్మల్ పవర్ ప్లాంట్‌లో చెలరేగిన మంటలను నాసా శాటిలైట్ చిత్రాలు ధృవీకరించాయి. దీనివల్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. అయితే, దీనిపై రష్యా నుంచి అధికారిక ప్రకటన రాలేదు.

వసంతకాలం నుంచి ఉక్రెయిన్ రష్యా చమురు శుద్ధి కర్మాగారాలు, క్రిమియాలోని ఇంధన సరఫరా మార్గాలపై దాడులు తీవ్రతరం చేసింది. ఈ దాడులు రష్యా పెట్రోల్ ఉత్పత్తిలో పెద్ద వాటాను భరించే కర్మాగారాల్లో ఉత్పత్తిని నిలిపివేయడం లేదా తగ్గించడం జరిగింది. ఇంధన నిష్పత్తి చర్యలు పెరుగుతున్నాయి. సైనిక నిపుణులు, విశ్లేషకులు చెప్పినదేమిటంటే.. రష్యా వాయు రక్షణ వ్యవస్థలను అధిగమించడానికి, వాటిలోని లొసుగులను బయటపెట్టడానికి భారీ సంఖ్యలో డ్రోన్లను ఒకేసారి ప్రయోగించే వ్యూహాన్ని ఉక్రెయిన్ అవలంబిస్తోంది. ఈ యుద్ధాన్ని ముగించేందుకు ఏడాది కాలంగా అమెరికా చేపట్టిన శాంతి ప్రయత్నాలు ఎలాంటి పురోగతి సాధించలేదు. ఈ నేపథ్యంలోనే రష్యా సైనిక స్థావరాలు, విద్యుత్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఉక్రెయిన్ ఇటీవల కాలంలో తమ దాడులను ఉద్ధృతం చేసింది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా స్పందించారు. "యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంతో 40 రోజుల ఆపరేషన్‌ను ఎస్బీయూ భద్రతా సంస్థకు ఆమోదించాను" అని ప్రకటించారు. మేజర్ జనరల్ ఎవ్‌హెన్ ఖ్మారా సమర్పించిన దీర్ఘ, మధ్యతరహా స్ట్రైక్ ప్రణాళికలను పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే రష్యాపై కీవ్ డ్రోన్లతో విరుచుకుపడటం గమనార్హం.

జెలెన్‌స్కీ ఈ దాడులు "పూర్తిగా న్యాయమైనవి"గా అభివర్ణించారు. "యుద్ధం ముగియాల్సిన సమయమైంది. రష్యా దౌత్యపరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలి" అని స్పష్టం చేశారు. మరోవైపు, రష్యా కూడా క్షిపణులతో దాడులు ముమ్మరం చేసింది. గత 24 గంటల్లో ఖర్కీవ్‌పై మాస్కో జరిపిన దాడిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్టు ఉక్రెయిన్ వెల్లడించింది. గత రాత్రి 189 రష్యన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు పేర్కొంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరిగి ఉక్రెయిన్ అంశంపై దృష్టి సారించే అవకాశం కనిపిస్తోంది. క్రెమ్లిన్ సహాయకుడు యూరీ ఉషాకోవ్ మాట్లాడుతూ అమెరికా దూతలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ త్వరలో మాస్కో పర్యటనకు వస్తారని తెలిపారు.

ఇదిలా ఉండగా కీవ్‌పై సైనిక చర్యకుగానూ రష్యాపై విధించిన ఆర్థిక ఆంక్షలను మరో ఏడాదిపాటు పొడిగిస్తున్నట్టు ఐరోపా సమాఖ్య వెల్లడించింది. 2027 జులై 31 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని ఓ ప్రకటన విడుదల చేసింది. డ్రోన్ దాడులు, శాంతి ప్రయత్నాలు, ఆంక్షలు.. అన్నీ ఒకేసారి పతాకస్థాయికి చేరుకున్న ఈ తరుణంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొత్త మలుపు తిరగబోతోందా అనే ప్రశ్న అంతర్జాతీయ సమాజాన్ని వేధిస్తోంది.


# భారత్.. కెరటాల కలలు!?




భారత్ సముద్రయాన చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. ఈ ఏప్రిల్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ భారత్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీతో కుదిరిన భాగస్వామ్యం.. కేవలం దౌత్య సంప్రదాయానికి మించి వ్యూహాత్మక మైలురాయిగా నిలిచింది. ఇరు దేశాలు 16 ఎంవోయూలు సహా మొత్తం 25 కీలక నిర్ణయాలను ప్రకటించాయి. నౌకానిర్మాణం, నౌకాశ్రయాల అభివృద్ధి, సముద్ర లాజిస్టిక్స్ అనే రంగాల్లో వోయేజెస్ చట్రం కింద చేతులు కలిపాయి. భారత్ ఇప్పటికే రూ.2.2 లక్షల కోట్ల విలువైన 400 నౌకల సేకరణ ప్రణాళికను ప్రకటించింది. ఈ భారీ అవసరాన్ని భారత భూమిపైనే తీర్చగల సామర్థ్యాన్ని నిర్మించడమే ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యం. ప్రపంచంలో అతిపెద్ద నౌకా నిర్మాతలైన సామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్, హెచ్‌డి కోసీ, హాన్వా ఓషన్.. ముగ్గురూ భారత్‌లో పెట్టుబడులు, భాగస్వామ్యాలు ప్రకటించాయి. 2030నాటికి అగ్రదేశాల్లో ఒకటిగా, 2047నాటికి టాప్ ఫైవ్‌లో నిలవాలనే భారత లక్ష్యానికి కొరియా అనుభవం అత్యంత అవసరమైన దిక్సూచిగా మారింది!

భారత్ సముద్రయాన చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించబడింది. ఈ ఏప్రిల్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ భారత్ పర్యటనకు వచ్చారు. ఎనిమిది సంవత్సరాల తర్వాత కొరియా అధ్యక్షుడు భారత్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోడీతో జరిగిన చర్చల తర్వాత ఇరు దేశాలూ 25 కీలక నిర్ణయాలను ప్రకటించాయి. ద్వైపాక్షిక సంబంధాలను 'భవిష్యత్ భాగస్వామ్యం'గా పరివర్తన చెందించే ప్రతిష్ఠాత్మక రోడ్‌మ్యాప్‌ను రెండు దేశాలు ఆవిష్కరించాయి. ఈ చారిత్రాత్మక సమావేశంలో అత్యంత కీలకమైన అంశం ఒక్కటే.. నౌకానిర్మాణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం. వోయేజెస్ (విజన్ ఫర్ ఆపరేషన్ ఆఫ్ యార్డ్ అసిస్టెడ్ గ్రోత్ విత్ ఎఫిషియన్సీ అండ్ స్కేల్) అనే సమగ్ర చట్రం కింద నౌకానిర్మాణం, నౌకాశ్రయాల అభివృద్ధి, షిప్పింగ్ లాజిస్టిక్స్, సముద్ర వారసత్వం అనే నాలుగు రంగాలలో ఇరు దేశాలు చేతులు కలిపాయి. లీ జే మ్యుంగ్ ఈ సహకారాన్ని ఇరు దేశాల పారిశ్రామిక సంబంధాల్లో "కొత్త ఆరంభం"గా అభివర్ణించారు. భారత్ దశాబ్దాలుగా కలగంటున్న సముద్రశక్తి స్వప్నానికి ఈ భాగస్వామ్యం వాస్తవరూపం ఇస్తుందని ఆశిస్తున్నారు. భారత్ తన వ్యాపారంలో అత్యధిక భాగాన్ని సముద్ర మార్గం ద్వారా నిర్వహిస్తున్నప్పటికీ విదేశీ నౌకలపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ నిర్మాణాత్మక లోపాన్ని కొరియా భాగస్వామ్యంతో అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ 2025 సముద్ర వారోత్సవంలో ప్రభుత్వ సంస్థల కోసం 400 నౌకల సేకరణ ప్రణాళికను ప్రకటించింది. మొత్తం విలువ రూ.2.2 లక్షల కోట్లు. ఈ భారీ అవసరాన్ని భారత భూమిపైనే తీర్చగల సామర్థ్యాన్ని నిర్మించడానికి కొరియా వ్యూహాత్మక భాగస్వామిగా ముందుకొచ్చింది. ప్రపంచంలో అతిపెద్ద నౌకానిర్మాతలలో మూడు కంపెనీలు కొరియాకు చెందినవేనని గుర్తుంచుకుంటే.. ఈ భాగస్వామ్యం యొక్క వ్యూహాత్మక విలువ అర్థమవుతుంది.

ఒప్పందాల పత్రాలనుంచి పరిశ్రమ వాస్తవికతలోకి అడుగు వేస్తే.. కొరియా భాగస్వామ్యం కేవలం నౌకలు నిర్మించడానికి మాత్రమే పరిమితం కాదు. హెచ్‌డి కొరియా షిప్‌బిల్డింగ్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజినీరింగ్ (హెచ్‌డి కోసీ) కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. తూత్తుకుడి, తమిళనాడులో 4 బిలియన్ డాలర్ల పెట్టుబడితో సీరో-ఎమిషన్ షిప్‌యార్డ్ నిర్మించే ప్రణాళికను ప్రకటించింది. అదేవిధంగా సామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్ (ఎస్‌హెచ్‌ఐ) స్వాన్ డిఫెన్స్ అండ్ హెవీ ఇండస్ట్రీస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. కొరియన్ నౌకాశ్రయాలు హెచ్‌డి కోసీ వంటివి బ్లాక్ ఫాబ్రికేషన్ పద్ధతులను ఉపయోగిస్తాయి. నౌకను భారీ విభాగాలుగా నిర్మిస్తారు. లోపలి పైపింగ్, విద్యుత్ సంబంధ పనులు 90 శాతం ముందే పూర్తి చేసి అప్పుడు ముక్కలు జోడిస్తారు. ఈ అసెంబ్లీ లైన్ పద్ధతిలో నిర్మాణ సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. సహాయక పరిశ్రమల అభివృద్ధి విషయంలో కూడా కొరియా ముందడుగు వేసింది. నౌకా డిజైన్, నిర్మాణం, సముద్ర పరికరాలు, నౌక మరమ్మత్తు రంగాల్లో 304 సంస్థలను కలిగిన కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ (కొమియా) ముంబైలో కార్యాలయం తెరిచింది. ఇది భారత్‌లో నౌకానిర్మాణ పర్యావరణ వ్యవస్థ నిర్మాణానికి పునాది వేస్తుందని నిపుణులంటున్నారు. కొరియా నౌకాశ్రయాలు ఆటోమొబైల్ పరిశ్రమ మాదిరిగా సీరియల్ ప్రొడక్షన్ లైన్ల ద్వారా నౌకలు తయారు చేస్తాయి. భారత్ నౌకలు నిర్మిస్తుంది. కొరియా నౌకలు తయారు చేస్తుంది. ఈ వ్యత్యాసమే రెండు దేశాల మధ్య అంతరాన్ని చూపిస్తుంది. ఈ అంతరాన్ని భర్తీ చేయడమే ఈ భాగస్వామ్యం యొక్క మూల లక్ష్యం. మానవ వనరుల అభివృద్ధి, సముద్ర విద్య, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో సైతం ప్రభుత్వస్థాయిలో, వ్యాపారస్థాయిలో పలు ఒప్పందాలు కుదిరాయి. భారత్‌లో వేగంగా పెరుగుతున్న నావికుల సంఖ్య కొరియా నౌకా యజమానులకు మానవ వనరుల మూలంగా అందుబాటులో ఉంటుంది. ఇది రెండు దేశాలకూ లాభదాయకమైన ఏర్పాటు. సాఫ్ట్‌వేర్, ఏఐ రంగంలో భారత్ బలం, అధునాతన తయారీలో కొరియా నైపుణ్యం.. ఈ రెండు శక్తులు కలిసినప్పుడు ఒక అపూర్వమైన సహకార నమూనా ఆవిర్భవిస్తుంది. అయితే ఒప్పందాలు, ఎంవోయూలు, ప్రకటనలు ఎన్ని వెలువడినా.. అవి కేవలం ప్రారంభ బిందువులు మాత్రమే. వాటిని వాస్తవంగా అమలు చేయడంలోనే అసలైన పరీక్ష ఉంది. భారత నౌకానిర్మాణ రంగంలో నీతి, నిర్వాహక లోపాలు ఇంకా పరిష్కారం కాలేదు. దీర్ఘకాలిక, తక్కువ వడ్డీతో మూలధనం అందుబాటు, నియంత్రణ స్థిరత్వం, చట్టపర అంచనాలు.. ఇవి ఇంకా పూర్తిగా నిర్మితం కాలేదు. నౌకానిర్మాణ పరిశ్రమ అంతర్జాతీయంగా పోటీపడాలంటే దశాబ్దాలపాటు నిరంతర విధాన మద్దతు, సాంకేతిక భాగస్వామ్యాలు, దీర్ఘకాలిక నిధులు అవసరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ జాప్యాలు, వ్యయం మితిమీరడం, నియంత్రణ అడ్డంకులు పోటీతత్వాన్ని తగ్గిస్తున్నాయి. తమిళనాడులో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌కు సూత్రప్రాయంగా అనుమతి లభించడం ఆశాజనకమైన సంకేతం. కానీ ఆమోదం నుంచి అమలు వరకు ప్రతి దశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా సహకరించాల్సి ఉంటుంది. కొరియా ఒక్కటే పరిష్కారం కాదు, అదొక అవకాశం మాత్రమే. 1970వ దశకంలో అత్యల్ప స్థాయినుంచి 15 సంవత్సరాల్లో ప్రపంచ నౌకానిర్మాణ శక్తిగా ఎదిగిన కొరియా అనుభవం భారత్‌కు స్ఫూర్తి. ఆ విజయం వెనక కేవలం విదేశీ సహకారం మాత్రమే కాదు, స్వీయ సంకల్పం, నిరంతర విధాన మద్దతు, నైపుణ్య అభివృద్ధిపై అచంచల దృష్టి ఉన్నాయి. భారత్ కూడా విధాన మద్దతు, సాంకేతిక నైపుణ్యం, నిపుణ మానవ వనరులు అనే మూడు స్తంభాలపై దృష్టి కేంద్రీకరిస్తే.. సముద్రపు శక్తిగా మారే స్వప్నం 2047కంటే ముందే సాకారమవుతుంది. లేకుంటే ఈ ఒప్పందాలు కేవలం కాగితాల చరిత్రగా మిగిలిపోతాయి!! ■



ఇతరుల బాహ్య రూపాన్ని, వారి హోదాను చూసి అతిగా ప్రభావితమైతే.. మీ కెరీర్‌ను మీరే చేతులారా పాడుచేసుకునే ప్రమాదముంది. ఎందుకంటే బయటకు కనిపించేవన్నీ నిజాలు కావు. లోకంలో చాలామంది మీకు పనికిరాని సలహాలిస్తూ తప్పుదోవ పట్టించవచ్చు. ఎవరినో చూసి, మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోకండి. మీ అంతరాత్మ చెప్పే మాట నమ్మండి. ఇతరులకంటే మీ గురించి, మీ సామర్థ్యం గురించి మీకే బాగా తెలుసనే నిజాన్ని గ్రహించండి. మరొకరి విజయాన్ని చూసి స్ఫూర్తి పొందడం మంచిదే. కానీ వారి మార్గాన్ని అంధంగా అనుసరించడం మీ ప్రత్యేకతను చంపుకోవడమే. మీ లోపల దాగున్న శక్తిని గుర్తించండి -ఆ శక్తే మీ అసలైన దిక్సూచి.

-మహాదేవ

వింతల్లో వింతలు

## కొత్తగా పెట్రోల్ మాత్రలు!



ఇంధన కొరతకు రష్యన్ మోటారిస్టులు వింత పరిష్కారం వెతుక్కున్నారు. అదే -పెట్రోల్ ట్యాంక్‌లో మాత్రలు వేయడం. రష్యాలో చమురు శుద్ధి తగ్గడంతో ఇంధన అమ్మకాలపై ఆంక్షలు, మరికొన్నిచోట్ల ధరలు ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితిలో నిరాశ చెందిన వాహనదారులు 'ఫ్యూయెల్ ట్యాబ్స్' అనే మాత్రలవైపు మొగ్గుచూపారు. గత నెలలో వీటి అమ్మకాలు 2.5 రెట్లు పెరిగినట్టు టెలిగ్రామ్ న్యూస్ ఛానల్ బాజా పేర్కొంది. బుకా, బీ-ఎకో బ్రాండ్ల పేర్లతో అమ్మే మాత్రలు ఇంజిన్ దహన సామర్థ్యాన్ని పెంచుతాయని, ఇంధన వినియోగాన్ని తగ్గిస్తాయని చెప్పుకుంటున్నారు. ఒక్కో మాత్ర 200 లీటర్ల పెట్రోల్‌కు సరిపోతుందట. అయితే, అదనపు రసాయనాలు పెట్రోల్‌లో ఇప్పటికే ఉన్న పదార్థాలతో చర్య జరిపి ఇంజిన్ ఇంజెక్టర్లకు హాని చేయవచ్చన్న హెచ్చరికలూ లేకపోలేదు.

